టోంది.

"ఎక్కడ చూసినా గాలే! ఊపిరి సలపని గాలి!" అనుకుంటూ మళ్ళీ కిందకి వచ్చేసాడు అప్పలకొండ.

కిందున్న అత్తగారు "కొండగాలి తిరిగింది" అనే పాట పాడుకుంటోంది. అప్పలకొండ వున్న ఊళ్ళో కొండలు లేవసలు.

ఏమిటో గాలి పాటలు అనుకుంటూండగా, పక్కింటి బుడతడు "అంకుల్ మీ డాబామీద గాలిపటాలు ఎగరేసుకోనా!" అంటూ వచ్చాడు.

"వద్దు బాబూ! మీ యింటిని ఏదో ఒక భయంకరమైన గాలి ఆవహించింది! ఆ గాలికి నీ గాలిపటం చిరిగిపోతుంది!"

వాడికి ఏం అర్థమయిందో తెలీదుగాని "అమ్మో అయితే వద్దు" అంటూ పరుగెత్తేసాడు.

**-బి.సోమయాజి (హైదరాబాద్)**

# వైద్యో నారాయణో...

అరగంటయింది బంటిని హాస్పిటల్‌కు తీసుకొచ్చి. రాత్రికి రాత్రి హఠాత్తుగా జ్వరం వచ్చింది. మామూలు జ్వరం అనుకుని పొద్దుటే తీసుకొచ్చాం. డాక్టరు సీరియస్ అన్నాడు. హాస్పిటల్‌లో చేర్చమన్నాడు. ఏవేవో టెస్టులు, మందులు రాశారు. అంతా ఖర్చే...బాబును చూస్తే భయమేస్తోంది. కానీ ఖర్చు...

రాయల్ యిన్వెస్ట్‌మెంట్ వాళ్ళు యిప్పుడే ఫోన్ చేశారు. నా ఎక్కౌంట్లో కొన్న షేర్ల ధరలు పడిపోయాయట. మార్జిను కట్టాలి రమ్మంటాడు. పోకుంటే అయినకాడికి అమ్మేస్తాడు. బంగారం లాంటి షేర్లు. అమెరికాలో బర్రెలకు కొత్త వ్యాధి వస్తే నాస్‌డాక్ పడిపోయింది. అది పడిందని ఆసియా మార్కెట్లు పడ్డాయి. సింపతీగా మన మార్కెట్టు పడింది. అంతే...టివి 18లో ఆ ఎనలిస్ట్ చెప్పలేదా..ఆ అంబానీ సోదరులేంటి అలా గొడవలు పెట్టేసుకున్నారు? అన్నదమ్ముల అనుబంధం వాల్‌పోస్టరు చూసి సినిమా హాల్లో దూరితే అన్నదమ్ముల సవాల్ సినిమా చూపిస్తున్నారే!


ఇప్పుడు ఈ హాస్పిటల్ ఖర్చులు ఎంత వేస్తారో ఏమో! ఆంధ్రాబ్యాంకు క్రెడిట్ కార్డ్ మొత్తం వాడేశా. స్టాండర్డ్ ఛార్టర్డ్ వాడికి డబ్బులు కట్టాలి. ఎస్‌బిఐ కార్డు నుండి డ్రా చేసి వాడికి కొంత కడదామనుకున్నాను. ఈలోగా ఈ ఖర్చు. ఆ ఫారెన్ బ్యాంకువాడు మరీను. లేట్ పేమెంట్ అంటూ 500 ఛార్జీలు, పైగా రోజూ ఫోన్లు, రికవరీ ఏజంట్ల బెదిరింపులు. ఎంతైనా మన బ్యాంకులే నయం. కాస్త వెసులుబాటు వుంటుంది. మనవాళ్ళూ వాళ్ళతో సమానంగా సర్వీసు చేస్తామని ఎగబడుతున్నారు. కొంపదీసి ఆంధ్రాబ్యాంకు వాళ్ళు కూడా లేట్ పేమెంటు ఛార్జీ 500కు పెంచుతారా! మన బ్యాంకే కదా అంత దూరం పోతారా..ఏమో గ్లోబలైజేషన్ కదా! ఆంధ్రా బ్యాంకు వాళ్ళు రేపు న్యూయార్క్‌లో బ్రాంచి పెట్టి వాళ్ళకు లేట్ పేమెంట్ ఛార్జీలు వడ్డిస్తారేమో!

ఈ డాక్టరేమిటి యింకా అబ్జర్వేషన్‌లో వుంచాలి అంటాడు. అసలు యీ డాక్టరూ కార్పొరేట్ హాస్పిటల్ రేంజిలో ఛార్జి చేస్తాడా! మంచివాడని విన్నామే! వీళ్ళంతా దొంగలు..టెస్ట్‌లని రాస్తారు. అందులో సగం కమీషన్ రూపంలో సాయంత్రానికి యింటికి చేరుతుంది. మందులు అక్కర్లేకపోయినా రాస్తారు. ఎంత రాస్తే అంత ఆదాయం. మందుల కంపెనీలు కమీషన్లు, కార్లు యివ్వవా...శాంపిల్స్ వీళ్ళు మెడికల్ షాపులకు అమ్మేయరా!

"విజయా! ఈ హాస్పిటల్‌లో అంతా ఖర్చే! ఒళ్ళు వెచ్చగా వున్నందుకు అబ్జర్వేషన్ అంటున్నారు. ఎంత బిల్లు వేస్తారో ఏమో!"

తను చురుగ్గా చూసింది. ఒళ్ళు కాలినట్లయి ఠక్కున తల తిరిగింది. ఆ కళ్ళనుండి వచ్చిన రేడియేషన్ ప్రమాదకరమా! సెల్‌ఫోన్ నుండి వచ్చే రేడియేషన్ ప్రమాదకరమా! ఏమో!...

పక్క మంచం మీద ఒక ఏడేళ్ళ పాప వుంది. వాళ్ళ నాయన రిక్షా కార్మికుడట. వీళ్ళకింత ఖరీదైన హాస్పిటల్



ఎవరు చెప్పారో! అమ్మాయికి చిన్నప్పట్నుంచి గుండెకు చిల్లు వుందట. వీళ్ళు తెలుసుకోలేకపోయారు. ఇంకో పదిహేనురోజుల లోపు ఆపరేషన్ చెయ్యాలి లేదా ప్రమాదం అన్నాడుట డాక్టరు. అసలు వీళ్ళు యిక్కడి దాకా ఎలా రాగలిగారు? ఆశ్చర్యమే!

డాక్టరు హడావిడిగా లోపలికొచ్చాడు. మేం లేచి నిలబడ్డాం. మమ్మల్ని కళ్ళతోనే పలకరించి రిక్షా కార్మికుడి దగ్గరకు వెళ్ళాడు.

"ఆపరేషన్‌కు రెండులక్షలు దాకా అవుతుందయ్యా! నాకన్నా పెద్ద డాక్టరు రావాలి. నువ్వెంత తెస్తావు?" అన్నాడు.

"రెండువేలు తేగలను బాబయ్యా! సాయంత్రం వీరయ్యగోరి వద్ద తండలు తీసి తెస్తాను" రిక్షా కార్మికుడు అన్నాడు.

డాక్టర్ నవ్వాడు. "ఏం చేద్దాం. దాంతో పని కాదు కదా?"

నేనెంత యివ్వగలను? అమ్మో! ప్రస్తుతం దమ్మిడీ యివ్వడం కూడా కష్టం. పేపర్లో ప్రకటన యిస్తే..ఫలానా అమ్మాయి ఫలానా ఆస్పత్రిలో వుంది. సాయం కావాలి అని రాస్తే ఎవరో ఒకరు ఆదుకోరా...సిఎమ్, పిఎమ్, గవర్నరు..పోనీ సినీనటి శ్రియఘోషాల్.

నా సెల్‌ఫోన్ రింగయ్యింది. "సార్ సార్! సెల్‌ఫోన్ ఆపండి" నర్సు కంగారుగా చెప్పింది. డాక్టరు నర్సుకేసి చూస్తూ "చేర్చుకునే ముందు యివన్నీ చెప్పవా!" అన్నాడు. నేను గోడవైపు చూశాను. గోడమీద 'సెల్‌ఫోన్లు నిషిద్ధం' అని రాసుంది.

"ఏం చేద్దాం!" మళ్ళీ డాక్టరు ఆలోచనలో పడ్డాడు.

"డాక్టరుగారూ! మీకు ఫోన్‌కాల్, హైదరాబాదు నుండి డాక్టరు సంజీవి...లైన్లో వున్నారు" అంటూ రిసెప్షనిస్టు సెల్‌ఫోన్ తెచ్చింది.

వింటున్న డాక్టర్ ముఖంలో రకరకాల భావాలు వ్యక్తం అవుతున్నాయి.

"ఎప్పుడొచ్చావురా! నువ్వు అమెరికా నుండి..."

"...."

"నా కేసు ఒకటి వుంది. నీకు పంపిస్తున్నా" కేసు క్లుప్తంగా వివరిస్తున్నాడు డాక్టర్.

"...."

"అహ...యిది నావల్ల కాదనిపిస్తోంది. వీళ్ళు ఆలస్యంగా వచ్చారు."

"...."

"ఆ! రేపే పంపిస్తున్నా! వుంటాను" సెల్‌ఫోన్ తిరిగి రిసెప్షనిస్ట్‌కు అందించాడు.

రిక్షా కార్మికుడి కూతురు దగ్గరకు వెళ్ళి "లక్కీ గర్ల్" అని భుజం తట్టాడు.

"నువ్వొక పని చెయ్యవోయ్! హైదరాబాదులో నా ఫ్రెండ్ దగ్గరకు వెళ్ళు. నేను లెటర్, ఎడ్రస్సు యిస్తాను. నీ పని జరుగుతుంది. అవును! ఆ రెండువేలు ఎప్పుడు తెచ్చుకుంటావు" అన్నాడు.

"సాయంత్రానికి బాబయ్యా!" అన్నాడు రిక్షా కార్మికుడు.

"అంత టైము లేదులే! యిదిగో! ఈ ఐదువందలు తీసుకుని వెంటనే బయల్దేరండి!" జేబులోంచి పర్సు తీస్తూ అన్నాడు.

"మరి ఆపరేషన్ ఖర్చు.."

"అవన్నీ ఆయనే చూసుకుంటాడు. నీకేం ఖర్చు కాదు పో!"

డాక్టర్ బయల్దేరబోతూ మా బెడ్ దగ్గరకు వచ్చాడు.

"వీళ్ళదగ్గర డిపాజిట్ కట్టించుకున్నారా!" అడిగాడు.

"ఇంకాలేదు సార్! ఉద్యోగస్థులే కదా కడతారని.." నర్సు అంది.

"ఎవరైనా ఒకటే! వెంటనే డిపాజిట్ కట్టించుకొని ట్రీట్‌మెంట్ మొదలుపెట్టండి.

డాక్టరు వడివడిగా వెళ్ళాడు.

రిక్షా కార్మికుడి కుటుంబం చేతులు జోడించారు సరే. నేను, నా భార్య ఎందుకు జోడించినట్లు?

**-ఎల్.శివానందశర్మ (తిరుపతి)**